ప్రశ్నించే తత్వం పెంచుకోవాలి —- నారంశెట్టి ఉమామహేశ్వరరావు

సృష్టిలో ఉన్న జీవరాశులన్నింటిలో మానవుడికి మాత్రమే బుద్ధి , జ్ఞానం , విచక్షణ ఇచ్చాడు దేవుడు. మనుషులు మాత్రమే ఆలోచించగలరు. ఆలోచించగలరు కాబట్టి ప్రశ్నించే సామర్ధ్యం కలిగింది. ప్రశ్నించేవాళ్లు మాత్రమే కొత్త విషయాలను తెలుసుకోగలరు. అంతేకాదు తమ కవసరమైన అన్ని రకాల సదుపాయాలను, సౌకర్యాలను, సమకూర్చుకుని అభివృద్ధి సాధించగలుగుతారు. తమ కలల్ని నెరవేర్చుకోగలుగుతారు.

ప్రపంచంలో విజ్ఞానం అభివృద్ధి చెందడానికి , మానవజాతి వరుస విజయాలతో ముందుకు దూసుకెళ్లడానికి మనుషుల్లోని ప్రశ్నించే తత్వమే కారణం. ప్రశ్నించాలనే ఆసక్తి లేని నాడు కొత్త విషయం తెలుసుకోవాలన్న ఉత్సుకత కలగదు. 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా మనిషి ఇప్పటికీ ఆదిమానవుడి లాగానే ఉండేవాడు.

వాతావరణంలో చల్లదనాన్ని తట్టుకునేందుకు, వన్యమృగాల నుండి రక్షణ పొందేందుకు నిప్పు పుట్టించాలని ఆదిమానవుడికి కలిగిన ఆలోచనతో రాళ్లను రాపిడి చేయడం లేదా రెండు కఠిన పదార్ధాలను రుద్దడం ద్వారా నిప్పు పుట్టించగలిగాడు. పచ్చి ఆహారాన్ని నేరుగా తినడం కాకుండా వేడి చేయడం, తదనంతరం వండుకుని తినే దిశగా వారిని అడుగులేయించింది. చలి , వర్షం, వేడిమి వంటి వాతావరణ ప్రతికూల పరిస్థితుల నుండి రక్షణ కలిగేలా గృహ నిర్మాణాలు చేసుకుని నివసించేలా అడుగులేయించింది. ప్రకృతిలోని మిగతా జీవరాశిపై ఆధిపత్యం చలాయించేలా ఆధిక్యుడిని చేసింది.

అవసరాలే అన్వేషణకు ప్రేరేపిస్తాయని ఆదిమానవుడి కాలంలోనే రుజువైంది. మానవుడి ప్రయాణం అక్కడితో ఆగలేదు. భూమి మీద మొదలైన మనిషి ఆలోచనలు అంతరిక్షం దాకా వ్యాపించాయి. వాటి ఫలితమే మనం అనుభవిస్తున్న ఆధునిక సాంకేతికత, శాస్త్రీయ పురోగతి. సమాజంలో వచ్చిన మార్పులన్నీ కొత్తగా ఏదైనా సాధించాలన్న ఆలోచనల ఫలితంగానే వచ్చాయి.

ప్రశ్నించడమంటే ఆలోచనా శక్తికి కొత్త చొరవనిచ్చి, నిజాన్ని తెలుసుకోవాలనే తపన పెంచుకోవడం. గొప్ప వ్యక్తుల జీవితాలను పరిశీలిస్తే ఆ విషయం స్పష్టంగా బోధపడుతుంది. వారు సాధించిన విజయాలన్నీ ప్రశ్నించే తత్వం పెంచుకోవడం వల్లే సాధ్యమయ్యాయని అర్ధమౌతుంది. 'వివేకాన్వేషణే జీవన విజయం' అని పెద్దలు చెప్పినట్టు ప్రశ్నించడం ద్వారా ప్రపంచాన్ని కొత్త దృష్టితో చూడగలం. అన్ని ఆవిష్కరణలూ ప్రశ్నించే తత్వంతోనే ప్రారంభమవుతాయి.

"భూమి సూర్యుని చుట్టూ తిరుగుతుందా?" అన్న ప్రశ్న ఉదయించడం వల్ల భౌతిక శాస్త్రవేత్త గెలీలియోకు శాస్త్రీయ ప్రపంచంలో కొత్త నిజాలను త్రవ్వే ప్రేరణ కలిగింది. తన పరిశోధనల ద్వారా సూర్య కేంద్రీయ తత్వాన్ని (Heliocentric theory) ప్రమాణీకరించాడు. తన ఆశయాల కోసం ప్రామాణికతను ప్రశ్నించి, టెలిస్కోప్‌ను ఉపయోగించి అనేక వ్యోమగామి విషయాలను కనుగొన్నాడు.

ఒక చెట్టు నుండి ఆపిల్ పండు కింద పడడం చూసిన ఐజాక్ న్యూటన్ "పండు నేలపై ఎందుకు పడింది?" అనే జిజ్ఞాసతో కూడిన ప్రశ్నను ఆలోచించడం వల్ల భూమికి ఆకర్షణ శక్తి ఉందన్న సూత్రాన్ని కనుక్కోగలిగాడు.

'ఈ ప్రపంచం ఎలా పనిచేస్తుందనే' ప్రశ్నకు సమాధానం వెతుకుతూ సాపేక్ష సిద్ధాంతాన్ని కనుగొన్న అల్బర్ట్ ఐన్‌స్టీన్ శాస్త్ర రంగంలో విప్లవం తీసుకువచ్చాడు. తన ప్రశ్నలతో ఆలోచించి మరెన్నో కొత్త విషయాలను తెలుసుకున్నాడు.

1980లో యూరోప్‌లోని ప్రముఖ పరిశోధనా సంస్థ *CERN* (European Organization for Nuclear Research) లో పనిచేస్తున్న శాస్త్రవేత్తలకు , తమ సమాచారాన్ని పంచుకునే సరళమైన మార్గం ఒకటి అవసరమని అనుకున్నారు. ఆ బృందంలో ఉన్న ప్రసిద్ధ బ్రిటిష్ కంప్యూటర్ శాస్త్రవేత్త టిమ్ బెర్నర్స్-లీ ఆ దిశగా చేసిన పరిశోధనల ఫలితంగానే మనం వాడుతున్న విశ్వవ్యాప్త వెబ్ (World Wide Web) ఆవిష్కరణ జరిగింది. సామాజిక, సాంకేతిక, ఆర్థిక రంగాల్లో ఇప్పుడెంతో మార్పు వచ్చిందంటే కారణం విస్తృతంగా లభిస్తోన్న అంతర్జాలమేనని చెప్పొచ్చు. సమాచార సేకరణకు, సమాచారం చేరవేయడానికి, ఇతరులతో వేగంగా, సులభంగా పంచుకోవడానికి కూడా స్వేచ్ఛ లభించింది. టిమ్ బెర్నర్స్-లీ జ్ఞానం, సృజనాత్మకతను ప్రపంచం ఎప్పటికీ మరచిపోలేదు.

ప్రశ్నించే విధానం శాస్త్రీయ పరిశోధనలకే కాదు సామజిక జీవనానికీ అవసరమే. సామాజిక అంశాల గురించి ప్రశ్నించడం ద్వారా సామాన్య ప్రజల సమస్యలకి పరిష్కార మార్గాలు లభిస్తాయన్న సత్యం గ్రహించిన మహాత్మా గాంధీ 'మీరు అన్యాయాన్ని ప్రశ్నించకుండా నిశ్శబ్దంగా ఉంటే, అది మరింత బలపడుతుందని' చెప్పేవారు . నిజమే!. ప్రశ్నించని సమాజం నీరసంగా ఉంటుంది. సామాజిక చైతన్యం, క్రమశిక్షణ, న్యాయస్థాపనలన్నీ ప్రశ్నించే ధైర్యంతోనే సాధ్యమౌతాయి. మన చుట్టూ జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను చూసి 'ఇదేంటని' ప్రశ్నించకపోతే, అవింకా పెరుగుతాయి. బలహీనులను పీడిస్తాయి. అరాచకం ప్రబలుతుంది. సమాజం బాగుండాలంటే ప్రశ్నించే తత్వం రావాలి.

మనలాంటి ప్రజాస్వామ్య దేశాల్లో ప్రశ్నించడం వల్లే ప్రజలకు కావలసిన అవసరాలన్నీ అందుతాయి. వాటిని అనుభవిస్తూ , పొందాల్సిన హక్కులను పొందుతూ సమధర్మం పాటించడానికి వీలౌతుంది. మన కర్తవ్యాలను పాటించడమెంత ముఖ్యమో మన హక్కులను తెలుసుకుని ప్రశ్నించడం కూడ పౌరులుగా అంతే ముఖ్యం.

ఇంతకీ ప్రశ్నించడమంటే కేవలం ఎదుటివారిని విమర్శించడం కాదు. 'నిజాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయడం ద్వారా ఎదగడం' అని గ్రహించాలి.

మనమున్న స్థితి నుండి ఉన్నత స్థితికి ఎదగాలంటే మన బలహీనతలను ప్రశ్నించాలి. కొత్త విషయాలు నేర్చుకోవడానికి, శోధనకు ప్రశ్నలే దారి చూపిస్తాయి. మనలో ఉన్న తప్పుల్ని గుర్తించి, వాటిని ప్రశ్నించుకుంటూ సరిదిద్దుకున్నప్పుడే వ్యక్తిగత అభివృద్ధి సాధ్యపడుతుంది. "మీ ఆలోచనలను ప్రశ్నించుకోండి, మీ నమ్మకాల పట్ల తర్జన భర్జన చేయండి. అప్పుడు నిజమైన జ్ఞానం మీకు లభిస్తుందని' స్వామి వివేకానంద చెప్పినట్టు ఎవరికి వారు ఎప్పటి కప్పుడు ప్రశ్నించుకుంటూ అభివృద్ధి చెందాలి.

"వేయి ప్రశ్నలుండు విజ్ఞానవేత్తకు/

ప్రశ్నలుండబోవు పామరునకు/

విజ్ఞుడౌను నరుడు జిజ్ఞాస చేతనే/

నవయుగాల బాట నార్ల మాట'/

అని నార్ల వారన్నట్టు ప్రశ్నిస్తూ , అన్వేషిస్తూ ఉత్తమ ఫలితాలను సాధించడం ద్వారా ఉన్నత స్థితికి చేరిన శాస్త్రవేత్తలున్నారు. వారిలో థామస్ ఆల్వా ఎడిసన్ ఒకరు.

బల్బు కనిపెట్టిన ఎడిసన్ జీవితంలో వెలుగులతో బాటు చీకట్లు ఉన్నాయి . పేదరికంతో బాధపడే కుటుంబంలో జన్మించిన ఎడిసన్ పాదచారులు నడిచే దారిలో , రైల్వే స్టేషన్ లో పేపర్లు అమ్ముతూ డబ్బు సంపాదించే వాడు. ఆ డబ్బుతో ఒకవైపు అమ్మకి సాయపడుతూ మరోవైపు తనకు ఆసక్తి ఉన్న పుస్తకాలు కొనుక్కుని చదివేవాడు. అతనిలోని జిజ్ఞాస , విజ్ఞాన తృష్ణ అతనిచే దాదాపు 1300 పరికరాలు కనిపెట్టేలా చేసింది. వాటిలో 1093 వస్తువులకు మేధోహక్కులను సాధించడమంటే మాటలా? ఆ విజయాల వెనుక ఆయన కృషి ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు .

రోజు మనం ఉపయోగించే చాలా వస్తువులు కనిపెట్టాడు ఎడిసన్. బల్బులు, గ్రామ ఫోనులు, సినిమాలకు సంబంధించిన ఫోటోగ్రఫీ పరికరాలు, దేశ రక్షణకు పనికొచ్చే వస్తువులు వంటివి కనిపెట్టి ఎవరూ అందుకోలేనంత ఎత్తున నిలబడ్డాడు. తనని తాను విశ్లేషించుకుంటూ , వైఫల్యాలను సవరించుకుంటూ "ఎందుకు? ఏమిటి? ఎలా ?' అని ప్రశ్నిస్తూ , వాటికి సమాధానాలు తెలుసుకోవడమే తన విజయాలకు కారణమని ఎడిసన్ చెప్పాడు.

తెలివి తక్కువ పిల్లాడు నుండి మేధావిగా ఎదిగిన ఎడిసన్ బాల్యం చిత్రంగా గడిచింది. బాల్యంలో అతడు తల్లిని అనేక ప్రశ్నలు వేసి వేధించేవాడు. ఇంద్రధనస్సులో రంగులెలా ఏర్పడ్డాయి? పాలు ఎందుకు పొంగుతాయి? మరి నీళ్లు ఎందుకు పొంగవు ? లోకంలో ఎన్నో రంగులుండగా ఆకాశం నీలంగానే ఎందుకుంది? పక్షులెలా గాలిలో ఎగురుతాయి? మనుషులెందుకు ఎగరలేరు? ఆకారంలో మరీ చిన్నవైన మర్రి పండ్లు, ఉసిరికాయలకు అంత పెద్ద చెట్లు ఎందుకు? పెద్దవైన గుమ్మడికాయలు కాసే చోట చిన్న పాదు ఉందేమిటి? అని మనసుకి తోచిందల్లా అడుగుతుండేవాడు. బాల్యం నుండే కొత్త విషయాలను తెలుసుకోవాలన్న ఆసక్తి ఎడిసన్ లో ఎంతగా ఉండేదో వాటిని బట్టి తెలుస్తోంది.

పాఠశాలలో కూడా ఎన్నో రకాల ప్రశ్నలు అడుగుతున్నాడని టీచర్లు కసురుకుని ఇంటికి పంపేవాళ్ళు. అలాంటప్పుడు అతడిని చక్కగా ఆదుకున్నది వాళ్లమ్మే। ఎడిసన్లో నిరుత్సాహం ఆవరించకుండా చక్కగా ప్రోత్సహించేది. అతడడిగిన ప్రశ్నలకు ఓపికగా జవాబులు చెప్పేది . ప్రశ్నలడిగే తత్వాన్ని ఎడిసన్ లో ప్రోత్సహించిన వాళ్ళమ్మ వైఖరి వల్లే గొప్ప శాస్త్రవేత్త అయ్యాడు ఎడిసన్.

ఇప్పటి పిల్లలకి ఎన్ని ప్రశ్నలున్నా తెలుసుకోవడానికి సహాయపడే కంప్యూటర్లు, ఇంటర్నెట్, పుస్తకాలు సహా మరెన్నో అవకాశాలున్నాయి. కాకపోతే వాళ్లలో 'ఎందుకు, ఏమిటి, ఎలా' అని ప్రశ్నించాలనే కోరిక కలగాలి.

ఎడిసన్ లోని సహనానికి , కొత్త వస్తువులను కనిపెట్టాలన్న తపనకు ఒక ఉదాహరణ చెబుతారు. ఆయన ఎలక్ట్రిక్ బల్బు కనిపెట్టడానికి వరుసగా 299 సార్లు విఫలమయ్యాడు. ఏ లోహంతో బల్బు లోపలి ఫిలమెంట్ తయారు చేసినా బల్బ్ వెలిగేది కాదు. చివరికి టంగ్స్టన్ వాడిన తరువాత మాత్రమే బల్బు వెలిగింది. అలా ఆ ప్రయత్నంలో విజయం సాధించాడు. ఆయన ఎంత సహనంతో పరిశోధనలు చేసాడో అనిపిస్తుంది కదా. ఏ విషయం ఆలోచించినా కొత్త కోణంలో ఆలోచించాలన్నారు ఎడిసన్. ఆయనలోని ప్రశ్నించే తత్వమే మన మీరోజు వాడుతున్న ఎన్నో వస్తువులకు రూపమిచ్చింది.

ప్రశ్న నుండి పుట్టు పరిణిత జ్ఞానమ్ము /

ప్రశ్న తోడ పెరుగు ప్రాభవమ్ము /

ప్రశ్న లేక ప్రగతి ప్రశ్నార్ధకమురా/

నవయుగాల బాట నార్ల మాట/

అన్నట్టు ప్రశ్నించే తత్వం అలవరచుకున్న అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త డాక్టర్ రాబీ ఏకంగా నోబెల్ బహుమతి అందుకున్నారు. ఆయనకు నోబెల్ బహుమతి వచ్చినప్పుడు ఒక విలేకరి ఇంటర్వ్యూ చేస్తూ 'విజయ రహస్యం ఏమిటో చెప్పమని' అడిగాడు. అందుకు డాక్టర్ రాబీ 'తన తల్లి' అని బదులిచ్చాడు. ఎంతో ఆశ్చర్యపోయిన విలేకరి, మరింత వివరంగా చెప్పమని కోరాడు. అందుకు రాబీ "నేను పాఠశాల నుండి ఇంటికి వెళ్లేసరికి 'బడిలో ఉపాధ్యాయుడిని ఏమైనా ప్రశ్నించావా' అని రోజు అడిగేది అమ్మ . బడిలో ప్రశ్నించాలంటే ముందుగా ఆలోచించాల్సి వచ్చేది. అందుకోసం నా ఆలోచనలకు పదును పెట్టేవాడిని. అలా మా అమ్మ నేర్పిన ప్రశ్నలడిగే తత్వమే నాకు నోబెల్ బహుమతిని ఇప్పించిందని" చెప్పాడు. పిల్లలు గొప్పగా ఎదగాలంటే తల్లి దండ్రుల ప్రోత్సాహమెంత అవసరమో పై ఇద్దరు శాస్త్రవేత్తల జీవితాలలోని బాల్యం నిరూపించింది కదా.

ప్రశ్నించే తత్వాన్ని ఎవరైతే పెంచుకుంటారో వాళ్లు జ్ఞానమార్గంలో నడవగలరు. అలాంటివాళ్లే మేధావిగా పేరు పొందుతారు. అలాంటి మేధావుల అన్వేషణ, శ్రమల ఫలితమే ప్రజలకు లభించిన కృత్రిమ మేధ సహా అనేక సదుపాయాలు, సౌకర్యాలు.

నేర్చుకోవాలన్న ఆసక్తి, కొత్త విషయాల మీద అనురక్తి ఉంటే నూతన విషయాల గురించి తెలుసుకోగలమని నిరూపించే సంఘటనలు ప్రపంచంలో ఎన్నో జరిగాయి. సముద్ర ప్రయాణం మీద ఆసక్తి పెంచుకున్న క్రిస్టఫర్ కొలంబస్ విషయం అలాంటిదే. ఆయన ఆసక్తి వల్లనే ప్రపంచానికి అమెరికా ఉన్న విషయం తెలిసింది. భారతదేశంలో వ్యాపారాన్ని విస్తరించాలనే పోర్చుగీసు వారి ఆలోచన, వాస్కోడిగామా ద్వారా భారతదేశానికి సముద్ర మార్గం కనుక్కునేలా సహాయపడింది. గాలిలో పక్షిలా ఎగరాలన్న రైటు సోదరుల కోరిక విమానం కనుక్కోవడానికి సహాయపడింది. అదిప్పుడు మానవాళికి ఎంతో ఉపయోగపడింది.

అవే కాదు …. అంతరిక్ష పరిశోధనలు, ఉపగ్రహాల ప్రయోగం, ప్రకృతి వైపరీత్యాలను గుర్తించి నిరోధించేలా ఎన్నెన్నో కొత్త దారులు ఏర్పడ్డాయి. వైద్య రంగంలో వినియోగిస్తున్న నూతన ఔషధాల తయారీకి , కరోనా వంటి మహా జాడ్యాన్ని తరిమికొట్టేందుకు వాక్సిన్ కనిపెట్టడానికి మార్గం సుగమం అయ్యిందంటే శాస్త్ర విజ్ఞానం వినియోగిస్తూ చేస్తున్న పరిశోధనలే కారణం కదా.

ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచిస్తూ విజ్ఞానాన్ని, అభివృద్ధిని సాధించిన దేశాలు ప్రపంచంలో ఉన్నాయి. తమ అన్వేషణా తత్వం, నూతన ఆలోచనలు, ఆవిష్కరణలతో ఇతర దేశాలకు మార్గనిర్దేశం చేస్తున్నాయి. అలాంటి దేశాల్లో క్రమశిక్షణ, నూతన ఆలోచనల సమన్వయంతో ఎదిగిన దేశం జపాన్. టెక్నాలజీ, రోబోటిక్స్, ఆటోమొబైల్ రంగాల్లో కొత్త మార్పులు తీసుకొచ్చింది. సౌర శక్తి, హైబ్రిడ్ కార్లు, బుల్లెట్ ట్రైన్ వంటి పరికరాల అభివృద్ధిలో మొదటి వరుసలో నిలిచింది .

భిన్నమైన సంస్కృతుల నుండి వచ్చిన కొత్త ఆలోచనలను స్వీకరించడం ద్వారా అమెరికాలో కంప్యూటర్, ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ వంటి ప్రపంచాన్ని మార్చేసే ఆవిష్కరణలు జరిగాయి. అంతరిక్ష పరిశోధన (NASA)లో కొత్త మార్గాలు ఏర్పడ్డాయి.

శ్రద్ధ, కష్టపడే తత్వంతో దక్షిణ కొరియా కూడా స్మార్ట్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ (Samsung, LG వంటి కంపెనీలు) రంగాల్లో ముందంజ వేసింది. గ్లోబల్ కల్చర్ హబ్‌గా (K-Pop, Korean Drama) ఎదిగింది.

చిన్నతనం నుంచే పెద్ద లక్ష్యాలను కలిగి ఉండటమనే సూత్రాన్ని అవలంబించిన సింగపూర్ విస్తీర్ణంలో చిన్నదైనప్పటికీ ఆర్థిక వ్యవస్థ, టెక్నాలజీలో అభివృద్ధి సాధించింది. ఇన్నోవేషన్‌తో నిర్మించిన స్మార్ట్ సిటీస్ మోడల్‌ను ప్రపంచానికి పరిచయం చేసింది.

మౌలిక సదుపాయాలు లేకపోయినా నూతన ఆలోచనలతో ప్రయోజనాలను సాధించవచ్చనే ధ్యేయం కలిగిన ఇజ్రాయెల్ - డిఫెన్స్ టెక్నాలజీ, ఐటీ రంగంలో గణనీయమైన ప్రగతి సాధించింది . నీటి వనరుల పరిరక్షణలో డిజిటల్ వ్యవస్థను అభివృద్ధి చేసింది. "స్టార్ట్-అప్ నేషన్"గా పేరు పొంది చిన్న కంపెనీలకు మార్గదర్శకంగా నిలిచింది.

సాంకేతికతను అనుసరించి ఉత్పాదకతను పెంచడం దిశగా అడుగులేసిన మరో దేశం చైనా. అత్యంత వేగంగా నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు సాంకేతిక రంగంలో పురోగతి సాధించింది. ఆర్థిక రంగంలో ప్రపంచానికి ప్రత్యామ్నాయ విధానాలు అందిస్తోంది. విస్తృత శ్రామిక శక్తిని ఉపయోగించి అనేక రంగాల్లో ప్రగతిని సాధించింది.

పరిశోధన, అభివృద్ధిపై నిరంతరం దృష్టి పెట్టడం ద్వారా జర్మనీ దేశం ఆటోమొబైల్ రంగంలో (BMW, Mercedes-Benz వంటి కంపెనీలు) నూతన ఆవిష్కరణలు చేసింది. సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలో స్థిరమైన అభివృద్ధి సాధించింది.

మన దేశం కూడా అంతరిక్ష పరిశోధన (ISRO)లో అనేక విజయాలు సాధించింది. డిజిటల్ ఆవిష్కరణల ద్వారా "డిజిటల్ ఇండియా" మిషన్ సమర్థవంతంగా నిర్వహించింది. ప్రజల్లో దాగిన ఆవిష్కరణ తత్వాన్ని ప్రోత్సహిస్తూ, ప్రపంచ స్థాయి మేధస్సును అందిస్తోంది.

ప్రశ్నించే తత్వం జీవితానికి కొత్త జ్ఞానాన్ని అందిస్తుంది. ఇది కేవలం ఒక వ్యక్తికి కాకుండా మొత్తం సమాజానికి మార్గదర్శనం చేస్తుంది. "ప్రశ్నించని మనిషి బుద్ధిహీనుడైతే, ప్రశ్నించడానికి భయపడే మనిషి బానిస" అనే నానుడిని గుర్తు పెట్టుకుని – ' ప్రశ్నించు, ఆలోచించు, ప్రపంచాన్ని మార్చు ' అనే సూత్రం నేర్చుకోవాలి ప్రజలు.

పిల్లల్లో ప్రశ్నించే అలవాటు పెంచితే, వాళ్ళు మరింత చైతన్యవంతులుగా, విజ్ఞానవంతులుగా మారే అవకాశం ఉంది. ప్రశ్నించే వైఖరిని బాల్యం నుండే ప్రోత్సహించాలి. సహజంగానే వాళ్ళకున్న ఉత్సుకతతో ప్రశ్నలెన్నో అడుగుతారు. చిన్న వయసు నుంచే "ఇదేం, ఇదెందుకు?, ఎలా?" అనే ప్రశ్నలు పిల్లల్లో కలుగుతుంటాయి. వాళ్ళని కసురుకోకుండా ఓపికగా జవాబు చెప్పాలి. పిల్లల పట్ల సహనం చూపించాలి. ఉపాధ్యాయులు కూడా బడి వేళల్లో విద్యార్థుల్లోని ప్రశ్నించే ధోరణిని ప్రోత్సహించాలి. పుస్తకాలు మాత్రమే కాకుండా, వాస్తవ జీవితంలోని అనేక అంశాల గురించి ఆలోచించేలా పిల్లలకు ప్రేరణ ఇవ్వాలి. ప్రశ్నించే తత్వం ఉన్న పిల్లలే తదుపరి కాలంలో ఆవిష్కర్తగా, శాస్త్రవేత్తలుగా, నాయకులుగా ఎదుగుతారు.

ప్రశ్నించే తత్వాన్ని పెంచుకోవాలంటే కొత్త ఆలోచన కలగాలి. అలా కొత్త ఆలోచన కలగాలంటే కొన్ని పద్ధతులు పాటించాలి. అవేంటో చూద్దాం .

పుస్తకాలు చదవడం, డాక్యుమెంటరీలు చూడడం, పరికరాలపై పరిశోధన చేయడం ద్వారా  ఆసక్తి లేని రంగాల నుంచి  కూడా కొత్త విషయాలు తెలుసుకోవచ్చు. ప్రకృతిని, చుట్టూ ఉన్న దినచర్యలను జాగ్రత్తగా గమనిస్తూ వాటి వెనుక ఉన్న కారణాలను తెలుసుకోవచ్చు. కళలు,  సంగీతం, రాయడం వంటి సృజనాత్మక కార్యకలాపాల్లో  పాల్గొంటూ  కొత్త ఆలోచనల్ని సృష్టించవచ్చు.   స్నేహితులు , పెద్దవాళ్ళ  అభిప్రాయాలను వింటూ , వాళ్ళతో చర్చల్లో పాల్గోవడం వల్ల  కొత్త ఆలోచనలు కలుగుతాయి. గూగుల్, యూట్యూబ్ , కృత్రిమ మేధ వంటి సామజిక మాధ్యమాలను వాడుతూ కొత్త  ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవచ్చు. ప్రముఖుల ఉపన్యాసాలను వింటూ కూడా కొత్త ఆలోచనలను పొందవచ్చును.

ప్రశ్నించే తత్త్వం   అలవరచుకున్న వాళ్ళకి  మిగతా వాళ్ళతో పోలిస్తే అదనపు ప్రయోజనాలు కలుగుతాయి. అవేంటో చూద్దాం. ప్రశ్నించే  తత్వమున్న వాళ్ళు  ఎప్పుడూ కొత్త విషయాలు తెలుసుకోవడానికి సిద్ధంగా ఉంటారు. అందువల్ల వాళ్లలో  విజ్ఞానం పెరుగుతుంది. కొత్త  సమస్యలకు వైవిధ్యమైన పరిష్కారాలు కనుక్కునే సామర్థ్యం పెరుగుతుంది.  ఎంత ఎక్కువ విషయాలు నేర్చుకుంటే  అంత సులభంగా సవాళ్లను ఎదుర్కోగలరు.  పనిచేసే విధానంలో మెరుగుదల కలగడమే కాకుండా సరికొత్త మార్గాలను అన్వేషిస్తారు. కష్టాలను తొలగించడానికి , కొత్త అవకాశాలను వెతకడానికి  వారి ఆలోచనా విధానం మెరుగవుతుంది. ఇతరులతో గాఢమైన చర్చలు జరపడం వల్ల  వాళ్లకు ఆసక్తికరమైన వ్యక్తిగా మారతారు. కొత్త విషయాలు నేర్చుకోవడం, తెలుసుకోవడం జీవితానికి ఆనందాన్ని, ఉత్సాహాన్ని ఇస్తుంది.

ప్రశ్నించకుండా  ఉండటం కంటే ప్రశ్నించడం వల్లే ఎక్కువ లాభాలున్నాయని  పైన తెలిపిన విషయాలెన్నో  రుజువు చేశాయి కదా. మరెందుకాలస్యం?  మీరు కూడా    జిజ్ఞాస పెంచుకుని కొత్తగా ప్రశ్నించండి .  కొత్త విషయాలు నేర్చుకోవడం మీద దృష్టి పెడుతూ మీకూ, కుటుంబానికి ,  సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా ఎదగండి.

——@@@@—-